క్లుప్తంగా

సర్పంచ్ రాజీనామా



ఎంపీడీఓ ఈశ్వరరావుకు రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న సర్పంచ్ సుశీల

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం సర్పంచ్ నడిమింటి సుశీల తన పదవికి శనివారం రాజీనామా చేసిందని ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ సుశీల లిఖిత పూర్వకంగా సమర్పించిన రాజీనామా పత్రాన్ని ఆమోదించే నిమిత్తం జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారులకు పంపిస్తామన్నారు. సర్పంచ్ ఎస్. సుశీల మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జరిగిన జెంటిల్‌మన్ ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ జగన్నాథం ఇకపై సర్పంచ్‌గా వ్యవహరిస్తారని, ఆయనకు తామంతా సహకరిస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని రెల్లివీధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెలగాం ప్రాంతంలోని కాలువలను కూడా శుభ్రం చేయాల్సి ఉందని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఈ, ఏఈ, స్థానిక కౌన్సిలర్, కాంట్రాక్టర్ రామారావు పాల్గొన్నారు.

120 లీటర్ల సారా పట్టివేత

సాలూరు: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న సారాను పట్టుకున్నట్లు సీఐ వాసునాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఒడిశా రాష్ట్రంలోని అలమండ నుంచి సాలూరు మీదుగా ద్విచక్ర వాహనంపై సారా తీసుకువస్తున్న ముగ్గురిని పట్టణంలోని చినబజార్ జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు పెదపెంకి గ్రామానికి చెందిన గొర్లె సత్యనారాయణ, ఎస్ సీతారాంపురానికి చెందిన ఈశ్వరరావు, కొమరాడకు చెందిన పవన్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

సాలూరు: పట్టణంలోని సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతమైంది. జడ్జి కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మనోవర్తి, తదితర సుమారు 146 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సాలూరు న్యాయవాదుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుపతిరావు, వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగిని సన్మానిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం : విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపును తీసుకువస్తాయని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ డీ అండ్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆవాల సూర్యనారాయణను శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ, ఆర్‌డీఓ కె.హేమలత, రెవెన్యూ సంఘ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చేనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలని సూచించారు. జూలై 27న సీతంపేట ఐటీఐలో ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎల క్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్‌మేకింగ్, ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 9390063881, 9491134464కు ఫోన్ చేయాలని కోరారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- షాపు అద్దె వసూలుపై రగడ
- వలంటీర్లకు గౌరవ వేతనం ఎందుకు చెల్లించలేదు : కౌన్సిలర్లు



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాప్ నంబర్ 20 అద్దె డబ్బులు సుమారు 11 లక్షల రుపాయలు ఎందుకు వసూలు చేయలేదని కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, తదితరులు ప్రశ్నించారు. 2017 నుంచి ఆ షాపు అద్దెకు తీసుకుంటే ఇంతవరకు అద్దె ఎందుకు వసూలు చేయలేదని మండిపడ్డారు. అధికారులు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో కౌన్సిలర్లు ఆగ్రహించారు. తక్షణమే దుకాణదారుడికి నోటీసులు ఇచ్చి అద్దె వసూలు చేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కారు అద్దెకు సంబంధించి నెలకు 34,900 రుపాయలు చెల్లించాలని అజెండాలో పొందుపరచగా.. సభ్యులు వ్యతిరేకించారు. సొంత కారులో తిరుగుతున్న ఆమెకు అద్దె ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చెట్లు నేలకూలాయని, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. పలు వార్డుల్లో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నాయని, వెంటనే సరిచేయాలని కోరారు. దీనికి మున్సిపల్ ఏఈ సూరప్పలనాయుడు స్పందిస్తూ.. ఇప్పటికి నాలుగుసార్లు విద్యుత్‌శాఖాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 5 లక్షల రుపాయల విలువ చేసే జిమ్ పరికరాలు వచ్చాయని, వాటిని పార్కుల్లో ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్ మాధవరావు కోరారు. 4వ వార్డులో గుర్తు తెలియని వ్యక్తులు సామాజిక మరుగుదొడ్లు పడగొట్టేసారని, దీనిపై మున్సిపల్ అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని కౌన్సిలర్లు ప్రశ్నించగా, ఈ వ్యవహారంపై పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీరామ్మూర్తి తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుధ్య వాహనాల నిర్వహణ ఖర్చుల వివరాలు తెలియజేయాలని వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి కోరారు.

గౌరవ వేతనాలు చెల్లింపులపై అలసత్వమా?

వలంటీర్లకు గౌరవ వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో వలంటీర్ల గౌరవ వేతనాలు చెల్లిస్తుంటే, మూడు నెలల నుంచి మీరెందుకు చెల్లించడం లేదని అధికారులను నిలదీశారు. వచ్చే నెల ఆరో తేదీలోగా చెల్లిస్తామని అధికారులు బదులిచ్చారు.

తాగునీటి సరఫరా ట్రయల్ రన్



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పూర్తి కావడంతో శనివారం తాగునీటి సరఫరా ట్రయల్‌రన్ నిర్వహించారు. సర్పంచ్ కురమాన రాధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రక్షిత మంచినీటి పథకం ఏఈ పవన్ కుమార్ మాట్లాడుతూ, చినబోగిలిలో సువర్ణముఖీ నది సమీపంలో ఉన్న ఓహెచ్‌ఆర్ నుంచి వీధుల గుండా ప్రధాన పైప్‌లైన్ అమర్చడం పూర్తయిందన్నారు. ప్రతి ఇంటికీ ఒక ట్యాప్ చొప్పున 550 కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రయల్ రన్ వేయడం వల్ల చిన్న చిన్న లోపాలను గుర్తించి, సరిచేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు

సీతానగరం: మండలంలోని జోగింపేటలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తహసీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది శనివారం పరిశీలించారు. కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని సర్పంచ్ కె. సింహాచలం ఫిర్యాదు చేయడంతో అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా గెడ్డ కాలువపై అడ్డుగా గోడలు నిర్మించుకున్నామని తెలిపారు. నీటి ప్రవాహం పెరిగినా, ప్రభుత్వం ఎప్పుడు తొలగించమన్నా తొలగించేందుకు తాము సిద్ధమని చెప్పారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.సింహాచలం, వీఆర్‌ఓ, సర్వేయర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



లంకెల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బాలగుడబ పంచాయతీ పరిధిలోని లంకెల చెరువును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, బందలు కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆక్రమణదారులపై వెంటనే చర్యలు చేపట్టాలని రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. ఇక నుంచి చెరువులు, బందలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నంబర్ 117ను రద్దు చేయాలి

గరుగుబిల్లి:

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రా పు మహేష్ అన్నారు. మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశా లల్లో తిరిగి చేర్చాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను కొనసాగించాల న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలు ఆలస్యం అవుతున్నందున మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరరావు, మండల కార్యదర్శులు రమణ, మన్మధరావు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు



ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావుకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బోనేల విజయచంద్ర

సీతానగరం: మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం నుంచి అజ్జాడ వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గోతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే రూ. 60 లక్షలతో శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యం, ఆర్. వేణుగోపాలనాయుడు, పార్వతీపురం పట్టణ పార్టీ నాయకులు బర్నాల సీతారాం, సీతానగరం నాయకులు టి. వెంకటప్పలనాయుడు, ఎస్. శ్రీనివాసరావు, సర్పంచ్‌లు టి. చంద్రోశేఖర్, జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్ కుమార్, బి. శ్రీనివాసరావు, ఎం. శంకరరావు, ఆర్ అండ్‌బీ ఏఈ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న నాయకులు, సభ్యులు

సాలూరు: మున్సిపల్ కాంట్రాక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, సభ్యులు ఎన్‌వై నాయుడు రాముడు, శంకరరావు, తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఇదే సమయంలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. అయితే సమస్యల పరిష్కారానికి కౌన్సిల్‌లో తీర్మానం చేసినా, ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధికారులపై మండిపడ్డారు.

పెద్దగోర్జి పనులకు ఆటంకాలు తొలగించండి

భామిని: మండలంలోని దిమ్మిడిజోల నుంచి పంట పొలాలకు వెళ్లే పెద్దగోర్జి రహదారి నిర్మాణానికి ఆటంకాలు తొలగించాలని దిమ్మిడిజోల సర్పంచ్ వలరౌతు రజిని, వలరౌతు రామారావుతో పాటు గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ పి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. పంటపొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే పెద్దగోర్జిలో ఉపాధిహామీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న వేతనదారులను కొందరు ఆక్రమణదారులు అడ్డుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో రెవెన్యూ అధికారులు పెద్దగోర్జి ఆక్రమణలు తొలగించి కొలత రాళ్లు పాతిన విషయాన్ని గుర్తుచేశారు.

మిశ్రమ పంటలతో ఆదాయం



బుడ్డిపేటలో పామాయిల్ తోటలో అరటి పంట

సీతానగరం: మెట్టు భూముల్లో రైతులు మిశ్రమ పంటలు వేసి అధిక ఆదాయం పొందుతున్నారు. మండల రైతులు ప్రస్తుతం పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. అయితే మూడేళ్ల వరకు ఈ పంట నుంచి దిగుబడులు రావు. ఈ నేపథ్యంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు పామాయిల్ తోటల్లో అరటి, నువ్వు, కీరదోస, గుమ్మడి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష మాట్లాడుతూ, అంతర పంటల వల్ల ఆదాయం బాగుంటుందన్నారు. మండలంలోని కొత్తవలస, అప్పయ్యపేట, రేపటివలస, దయానిధిపురం, గాదెలవలస, గుచ్చిమి, సీతారాంపురం, రంగంపేట, గెడ్డలుప్పి, సూరంపేట, చిన్నారాయుడుపేట, మరిపివలస, బుడ్డిపేట, పెదబోగిలి గ్రామాల్లో మిశ్రమ పంటలు సాగవుతున్నాయని చెప్పారు.

నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ శాఖాధికారులతో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైన పాలకొండ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధిదీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు ఆదేశించారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ జరిగిన వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని తహసీల్దార్ వరహాలను ఆదేశించారు.

ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థుల ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం స్టూడెంట్ లీడర్ల ఎంపికను చేపట్టారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఓటింగ్ ద్వారా స్టూడెంట్ లీడర్లను ఎన్నికున్నారు. నామినేషన్ల ఘట్టం, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, ఓటింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు పర్యవేక్షించారు. ఎన్నికల అధికారులుగా అధ్యాపకులు బి.ముత్యాలు, ఎ.నర్సయ్య, ఆర్.సంతోస్‌కుమార్, కె.సూరిబాబు వ్యవహరించారు. మొత్తం ఏడు వందల మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతలకు ప్రకటించారు. మోడల్ స్కూల్ కెప్టెన్‌గా ఇంటర్ విద్యార్థి శ్రీరామ్ వంశీ, వైస్ కెప్టెన్‌గా చెంగల కార్తీక్, స్పోర్ట్స్ కెప్టెన్‌గా పాలక కార్తీక్‌లు ఎన్నికయ్యారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ విధంగా విద్యార్థి నాయకుల ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు తెలిపారు.

మాకు న్యాయం చేయండి



డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

సీతంపేట: తమకు న్యాయం చేయాలని కోరుతూ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు శనివారం సీతంపేట ఐటీడీఏను ఆశ్రయించారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెగా డీఎస్సీలో తమ పోస్టులు కలపడంతో తామంతా వీధిన పడతామన్నారు. మొత్తం 1143 పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానం నుంచి కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్, జేఎల్‌లుగా మార్చాలన్నారు. గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాదికి సంబంధిత తమను ఇప్పటి వరకు రెన్యువల్ చేయలేదని వాపోయారు. 2022 పీఆర్‌సీలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు వేతనం పెరిగితే తమకు మాత్రం పెరగలేదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బిడ్డిక గణేష్, మోహనరావు, ఈశ్వరి, భవాని, ధర్మారావు, క్రాంతి, బాబూరావు, సింధు పాల్గొన్నారు.

320 కేసుల పరిష్కారం

పాలకొండ రూరల్: రాజీయే రాజమార్గమని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి విజయ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్‌అదాల త్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న 320 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తెర్లాం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన.. వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల బారినపడే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని, వీధి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు గ్రామాల్లోని ప్రతీ ఇంటికీ వెళ్లి, డయేరియా, జ్వరాలతో ఎవరైనా బాధపడుతున్నారా లేదా అని పరిశీలించాలన్నారు.